APTEL/25/A2844

# క్రై కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు దిన పత్రిక

సంపుటి : 01    సంచిక : 28    క్రిష్ణా,    బుధవారం 22- 10 - 2025    పేజీలు : 4    వెల. 2 /-

రిపోర్టర్లు కావలెను

క్రై కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349

## మహిమాన్వితం కార్తీకమాసం శివకేశవులను ధ్యానించే మాసం



నంద్యాల కల్చరల్, అక్టోబరు 21 శివ,కేశవులకు అత్యంత ఇష్టమైనది కార్తీకమాసం. ప్రతిఏటా దీపావళి పండుగ వెళ్లిన మరుసటి రోజు నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుంది. నోములు, వ్రతాలకు ఈ మాసం ఎంతో ప్రధాన్యం. బుధవారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. తెలుగు సంవత్సరంలో వచ్చే ఎనిమిదో మాసమే కార్తీకం. చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలుస్తాడు కాబట్టే ఈ మాసాన్ని కార్తీకం అని అంటారు. శివకేశవులను భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ మాసంలో చేసే పూజలు, నోములూ వ్రతాల వల్ల ఎన్నో శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే హైందవులు ఈ నెల మొత్తం నోములు, వ్రతాలు, జపం, ధ్యానం, పూజ, దానం, దీపారాధనతో భక్తిని చాటుకుంటారు. నెల రోజుల పాటు చేయలేని వారు కార్తీకంలో వచ్చే ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి, సోమవారాల్లో ఉపవాస దీక్షను నియమనిష్టలతో ఆచరిస్తుంటారు. ఆ రోజుల్లో ఉపవాసం ఉండి చీకటి పడిన తర్వాత నక్షత్ర దర్శనం చేసుకుని ఉపవాసాన్ని విడుస్తారు.

దీపారాధనకు ప్రాధాన్యం: కార్తీక మాసంలో దీపారాధనకు మహిళలు అధిక ప్రాధాన్యమిస్తారు. పూజలు చేసిన మహిళలు ఉపవాసాలతో శివకేశవులను ధ్యానిస్తారు. ప్రధానంగా సోమవారం రోజున బ్రహ్మ ముహూర్తంలోనే లేచి చన్నీటి స్నానాలు చేసిన తర్వాత కార్తీక దీపాలను వెలిగిస్తే పుణ్యఫలం సిద్ధిస్తుందని మహిళలు భావిస్తారు. ఈ నెలలోనే అయ్యప్ప దీక్ష మొదలై సంక్రాంతి వరకూ కొనసాగుతుంది. కార్తీక మాసంలో గంగానది, నదులు, పుష్కరిణి, చెరువుల్లో దీపాలను పవిత్రంగా వదిలి మొక్కులు తీర్చుకుంటారు. ఇదే మాసంలో తులసి, ఉసిరి చెట్టుకూ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. కార్తీక వనభోజనాల పేరుతో ఉసిరి చెట్ల కింద సామూహిక భోజనాలు చేసి మానవ సంబంధాలు, కుటుంబ బంధాలను మెరుగుపర్చుకుంటారు.

మహానందిలో 'ఆకాశ దీపం'మహానంది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మంగళవా రం రాత్రి ఘనంగా కార్తీక మాసోత్సవాలను ఆలయ వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాల్లో పూజ లు నిర్వహించిన అర్చకులు ధ్వజస్తంభం వద్దకు పూజా ద్రవ్యాలతో చేరుకున్నారు. కార్తీక మాస ఉత్సవాల సందర్భంగా సకల దేవతలను మహా నంది క్షేత్రానికి ఆహ్వానిం చేందుకు వీలుగా 'ఆకాశ దీపం' వెలిగించారు. వచ్చే నెల 20వ తేదీ వరకు మహానందిలో కార్తీక మాస ఉత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ వెల్లడించారు.

## ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల హర్షాతిరేకాలు



అమరావతి, అక్టోబర్ 21: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల %జూ% విడుదలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన  నంబర్ 60, 61 లలో మార్పులు చేసింది చంద్రబాబు సర్కారు. ప్రభుత్వ ఉద్యోగులకు నేటి నుంచి ఏడాది లోపు మూడు వాయిదాలలో  బకాయిలు చెల్లించాలని నిర్ణయించారు. ఈ మొత్తాన్ని ఉద్యోగుల  ఖాతాల్లో జమ చేయాలని  లో సవరణలు తీసుకొచ్చారు. ఉద్యోగులు, పెన్షనర్ లకు ఏడాది లోపు మూడు వాయిదాలలో చెల్లించాలని ఆదేశాలిచ్చారు.దీనికి సంబంధించి కొంచెంసేపటి క్రితం ఏపీ ప్రభుత్వం కొత్త విడుదల చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన  బకాయిలు ఉత్తర్వులను సవరిస్తూ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్  నంబర్ 62 ను విడుదల చేశారు. తాము ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే సవరణ  ఇచ్చినందుకు సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీసబ్ ప్లాన్ నిధులను సమర్థంగా వినియోగించాలి



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21  : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆ కార్యక్రమం అమలు వాస్తవ స్ఫూర్తితో వినియోగించాలని కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు, స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం ఎస్సీ, ఎస్టీకాంపోనెంట్ ప్లాన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాస్థాయిలో ఆయాశాఖల వారీగా ఖర్చు పెట్టిన విధానాన్ని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొన్ని శాఖలు లక్ష్యాలకు దూరంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బలహీనవర్గాల అభివృద్ధి, వారి ఆవాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి మెరుగుపర్చాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ నిధులను కేటాయిస్తుందని తెలిపారు. అదే స్ఫూర్తితో ఆయా వర్గాలకు ప్రయోజనం కలిగేలా ని?ధులను ఖర్చు చేయాలన్నారు. వచ్చే సమావేశం నటికి నిధుల వినియోగంలో స్పష్టమైన మార్పు రావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ అధికారి వరలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీకి ఆమోదం

జిల్లాలోని సముద్రతీర మత్స్యకారులకు పీఎంఎంఎసవై పథకం ద్వారా ఎంపికైన చేసిన లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయాలని జిల్లా స్థాయికమిటీ సమావేశంలో ఆమోదించారు. కలెక్టర్ రాజాబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కొత్తపట్నం మండలం పల్లెపాలేనికి చెందిన మత్స్యకారులకు లైఫ్ జాకెట్స్, జీపీఎస్ సెట్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు సరఫరా చేయాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లామత్స్యశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా అధికారులైన కమిటీ సభ్యులు బి. చిరంజీవి, ఎస్. శ్రీనివాసరావు, వరలక్ష్మి, టి.నారాయణ, రమేష్, ఎల్‌డీఎం సుధాకర్, జిల్లామత్స్యసహకార సంఘం అధ్యక్షుడు పేరయ్య తదితరులు ఉన్నారు.

## పోలీసులపై రెచ్చిపోయిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. తీవ్రంగా దూషిస్తూ..



వైసీపీ మాజీ ఎమ్మెల్యే వెంకటె గౌడ, ఆయన అనుచరులు రెచ్చిపోయి ప్రవర్తించారు. పోలీసులతో గొడవకు దిగారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. పలమనేరులో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు అంటూ మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు వాటిని తొలగించే ప్రయత్నాలు చేశారు. నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ మొదలైంది. వివాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గొడవను ఆపే ప్రయత్నం చేశారు. అయితే, మాజీ ఎమ్మెల్యే వెంకటె గౌడ, ఆయన అనుచరులు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ పోలీసులపై రెచ్చిపోయారు. నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తి .. 'నిర్మాణం చేపడుతున్న స్థలం ప్రభుత్వ స్థలం కాదు. మాకు ఎప్పటి నుంచో పట్టా ఉంది. ఇదివరకే ఈ వివాదానికి సంబంధించి కోర్టులో స్టే కూడా నడుస్తోంది' అని ఎంత చెబుతున్నా..అతడి మాటలు మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పట్టించుకోలేదు. దౌర్జన్యానికి దిగారు. నిర్మించిన గోడను కూల్చే ప్రయత్నం చేశారు. నిర్మాణదారుడు ప్రస్తుత ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి కావడంతో వివాదం రాజకీయ రంగు పులుముకుంది. మాజీ ఎమ్మెల్యే వెంకటె గౌడ పోలీసులతో ప్రవర్తించిన తీరు వివాదాస్పదంగా మారింది.

## పట్టణాల్లో మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం



అమరావతి, అక్టోబర్ 21: రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పట్టణాలలో తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అమృత్ 2.0 పథకం కింద 281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ శాఖ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఏపీయూఎఫ్ఐడీసీ  పబ్లిక్ హెల్త్, గ్రీన్ బిల్డింగ్స్ కార్పొరేషన్లకు ఈ పనుల నిర్మాణంతోపాటు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జారీ చేసి ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే మొత్తం ప్రాజెక్టు ఖర్చులో కేంద్రం రూ. 2, 470 కోట్లు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2, 490 కోట్లు విడుదల చేయనున్నాయి. ఇక ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 925 కోట్లు విడుదల చేయనుంది. పట్టణాల వాటా రూ. 590 కోట్లుగా నిర్ధారించింది. అంతా కలిపి ప్రాజెక్టు క్యాపెక్స్ రూ.6, 477 కోట్లుగా.. దీనికి 10 ఏళ్ల నిర్వహణ ఖర్చు రూ.1, 499 కోట్లుగా నిర్ణయించింది. ఇక వడ్డీ ఖర్చు కింద రూ. 2,344 కోట్లు భారం పడనుంది. ఈ మొత్తం ప్రాజెక్టు విలువ రూ.10, 319. 93 కోట్లు. మరోవైపు ఈ పనులు తీసుకునే సంస్థలు.. ఒప్పందం సమయంలో కొంత మొత్తం సెక్యూరిటీగా చెల్లించాలనే నిబంధనను విధించింది. ఈ పనులు సాగుతున్న సమయంలో ఈ నిధులు కట్ చేయకుండా మాఫీ చేసేందుకు అనుమతి సైతం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, పట్టణాల వాటా కోసం అవసరమైన నిధులను సేకరించేందుకు కి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది రాష్ట్ర పట్టణాభివృద్ధి చరిత్రలోనే అతి పెద్ద పెట్టుబడి పెట్టిన ప్రాజెక్ట్‌గా రికార్డుల్లో నమోదవనుంది.

## వచ్చే 3 రోజులు కుండపోత వర్షాలు

ఏపీ ప్రజలు అలర్ట్చేసే వార్తను విశాఖపట్నం వాతావరణ శాఖ చెప్పింది. నైరుతి బంగాళాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ తెలిపింది. భారీ గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ, రేపు(బుధవారం)మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు- దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకుని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. అనంతరం ఈ వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు%-% ఏపీలోని దక్షిణ కోస్తా వైపు కదులుతూ తదుపరి 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన  ప్రభావంతో రాబోయే 24 గంటల్లో ఓ మోస్తారు వర్షాలు అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. రాబోయే మూడు రోజులు పాటు ఆంధ్రప్రదేశ్ తమిళనాడు, తెలంగాణలోని కొన్ని జిల్లాలో విస్తారంగా వర్షాలు కరుస్తాయని ఐఎండీ తెలిపింది. మంగళవారం, బుధవారం, గురువారం ఏపీలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు, 30 నుండి 40 కి.మీ వేగంతో కలిగిన ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.

## వైజాగ్‌కి గూగుల్ పెట్టుబడి రావడానికి కారణం శాంతి భద్రతలు: సీఎం చంద్రబాబు

ఇంటర్నెట్ డెస్క్, అక్టోబర్ 21: సమాజంలో అశాంతి సృష్టించడానికి రాజకీయ ముసుగులో కొత్త నేరాలు చేస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మంగళగిరి %ూూూ% బెటాలియన్?లో జరిగిన పోలీసు అమరవీరుల దినోత్సవం కార్యక్రమంలో సీఎం పాటు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాణం తాత్కాలికమని.. చేసే పని శాశ్వతమని చెప్పారు. రాజకీయ కుట్రతో ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని.. కుల మత చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా పెద్ద ఛాలెంజ్ గా మారిందని అన్నారు. వ్యక్తిగత హననానికి కొందరు పాల్పడుతున్నారని చెప్పారు. తాను ఎంతో మందిని చూస్తున్నానని.. ఇబ్బందులతోవారు కుమిలిపోతున్నారని అన్నారు. రాష్ట్ర పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్న సీఎం.. నేరస్తులు, సంఘవిద్రోహక శక్తుల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో అస్సలు రాజీ పడవద్దని సూచించారు. పోలీసులు ప్రభుత్వానికి, ప్రజలకు అండగా ఉండాలని.. మీకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.పోలీసులకు భీమా కల్పించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు.

# ప్రజా ఉద్యమంలా కోటి సంతకాల సేకరణతో సర్కార్ దిగొచ్చేలా చేద్దాం

**ఈ ఉద్యమం తో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి....**
**సయ్యద్ గౌస్ మోహిద్దీన్...**
**వైసీపీ మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి....**



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా** :కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం తో ప్రైవేటీకరణ చేయాలనే దురాలోచనకు వ్యతిరేకంగా వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి , ఆదేశాలతో సాగుతున్న సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొని నిరంకుశ కూటమి సర్కార్ దిగొచ్చేలా! చేయాలని రాష్ట్ర ప్రజలకు వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మంగళవారం నాడు ఒక ప్రకటన లో పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మాట్లాడుతూ ఈ ప్రజా ఉద్యమం లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని సంతకాలు చేస్తేనే ప్రజాభిప్రాయం ఏమిటో! కూటమి ప్రభుత్వానికి అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించేందుకు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి సర్కార్ పెద్ద ఎత్తున్న వైద్య కళాశాలల నిర్మాణం ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిందనన్నారు.నేడు కూటమి ప్రభుత్వం నిరంకుశ విధానాలతో వాటిని ప్రైవేటు పరం చేసి వైద్యం అనేది ప్రజలకు అందకుండా చేసి వైద్యమో రామచంద్ర అనే మాదిరిగా కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని ఆయన విమర్శించారు. మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ అనునిత్యం ప్రజాసేవలో ఉండే అన్నా రాంబాబు మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పటికీ ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో అలుపెరుగని నాయకుడిలా ప్రజా సేవ కొరకు ప్రజల కొరకు చురుకుగా పాల్గొన్నారు. అన్నా రాంబాబు ,కి తోడుగా మాజీ ఎమ్మెల్యే %ు% నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి తమ వయసుని సైతం లెక్కచేయకుండా యువకుడిలా పాల్గొంటూ తమ వంతు సహాయ సహకారాలతో ఈ కార్యక్రమానికి అందించారని వీరిని చూసి మాలాంటి వారికి నూతన ఉత్సాహాన్ని కలగజేసారన్నారు. తమ నేతలు అందించే స్ఫూర్తితో నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న పాల్గొని ప్రభుత్వం దిగొచ్చేలా చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఇటువంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలతో కూటమి సర్కార్ మానుకోవాలని ఆయన కోరారు. లేకపోతే కూటమి సర్కార్ కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన తెలిపారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమం వచ్చే ఎన్నికల్లో కూటమి సర్కార్ ఓటమి కి రెఫరండం లా నిర్వహించాలని ప్రజలకు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విన్నవించారు......











**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** పెదార వీడు పోలీస్ స్టేషన్ పోలీసు వారి ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం అక్టోబర్ 21 పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగింది.
అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ను పురస్కరించుకొని పెద్దారవీడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి సాంబశివయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మరియు %ఖ×ూ% ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థుల తో కలిపి దేవరాజు గట్టు లో భారీ ర్యాలీ నిర్వహించటం జరిగినది. తదుపరి దేవరాజు గట్టు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద జంక్షన్ లో విద్యార్థులు పోలీసుల ఆధ్వర్యంలో మానవహారం గా ఏర్పడి విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల ను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దారవీడు ఎస్ఐవి సాంబశివయ్య , మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కొరకు ప్రజల యొక్క ధన,మాన, ప్రాణాలను కాపాడుటలో నిరంతరము శ్రమిస్తూ ఉంటారని అలాంటి పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలలో వారిని స్మరించుకోవడం పోలీస్ సేవలు పొందుతున్న ప్రజలందరి యొక్క బాధ్యత అని వారిని వారి సేవలను స్మరించుకోవడం కనీస కృతజ్ఞత అని మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఆరవీడు పోలీస్ స్టేషన్ సిబ్బంది కిట్స్ కాలేజీ విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది....



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** మార్కాపురం పట్టణం...జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసే క్రమంలో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు .విద్యార్థులు కుర్చునీ తినేందుకు చోటు లేక చెట్ల కింద కుర్చొని తింటున్న వైనం .పాఠశాలలో తాగేందుకు మంచినీరు కూడా సరిగా లేకపోవడంతో బోర్ వాటర్ తాగుతున్న విద్యార్థులు..

# పారదర్శకంగా ధాన్యం సేకరణ



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా ::** జిల్లాలో పారదర్శకంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పార్వతీపురం మండలం వెంకంపేటలో ఉన్న రైస్‌మిల్లును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. రైతులకు మంచి గోనె సంచులు ఇవ్వాలన్నారు. ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సాయంత్రం ఐదు గంటల వరకు ట్రక్ షీట్లు జనరేట్ అవుతాయని, అందుకు తగిన విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీపీసీ వద్ద అందుబాటులో ఉన్న అన్ని రికార్డులు, పరికరాలను పరిశీలించారు. టార్పాలిన్లు, సిబ్బంది వివరాలను జేసీ అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లను సమన్వయం చేసు కుంటూ కస్టోడియన్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.

# పట్టణంలో ఘనంగా అమరవీరుల సంస్కరణ ర్యాలీ...



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా** :పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో పోలీసులు విద్యార్థులు తో ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఎస్పీ నాగరాజు, బీజేపీ ఇంచార్జి కృష్ణారావు,ఏ.ఎం.సి.చైర్మన్ వెంకట రెడ్డి,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ పోలీస్ స్టేషన్ నుండి నాలుగు మాడవీధుల్లో గుండా వెళ్ళి కంభం సెంటర్ లో మానవహారం నిర్వహించారు.....

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా.. గుజ్జుల ఈశ్వరయ్య

**గుజ్జుల ఈశ్వరయ్య శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ మండల నాయకులు.**



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా** ః సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన గుజ్జుల ఈశ్వరయ్య కి శుభాకాంక్షలు తెలిపిన పామూరు మండల నాయకులు. మంగళవారం స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్ దగ్గర టపాకాయలు పేల్చి ,మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పోతల ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచి అనేక ఉద్యమాలలో పోరాటాలలో పాల్గొని సమస్యల కోసం పోరాటాలు నడుపుతూ జైలుకి వెళ్లినటువంటి ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల పామూరు మండల సమితి ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబరాలు చేసుకోవడం జరిగినది. కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి అనేక పోరాటాల్లో పాల్గొన్నటువంటి యువ నాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య అలాంటి యువ నాయకులకు సిపిఐ లో రాష్ట్ర కార్యదర్శి రావడం ఎంతో ఆనందంగా ఉందని సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి మస్తాన్ రావు ,వెంకట్ రెడ్డి, సూరిబాబు, సుబ్బారావు, రఘునాథ్ రెడ్డి, మహేష్, రవి, దేవయ్య, పోతల ప్రభాకర్, సిపిఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ అమరవీరుల త్యాగం మరువలేనిది .సి ఐ ఎం బీమా నాయక్

**ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవ ర్యాలీ**







**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** విధి నిర్వహణలో పోలీస్ అమరవీరుల త్యాగం మరువలేనిదని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం బీమా నాయక్ అన్నారు. మంగళవారం పామూరు సర్కిల్ కార్యాలయంలో సిఐ ఏం.భీమా నాయక్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత చైనా సరిహద్దుల్లో సబ్ ఇన్స్పెక్టర్ కరమ్ సింగ్ నేతృత్వంలో 20 మంది కానిస్టేబుల్ తో ప్రత్యర్థులతో పోరాడి శత్రు ముకల చేతుల్లో అమరులైన కేంద్ర రిజర్వు పోలీస్ త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న పోలీస్ అమరవీరుల దినోత్సవం ను జరుపుకుంటామని తెలిపారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు ప్రజలను కాపాడే క్రమంలో అమరవీరులయ్యారని గుర్తు చేశారు.అనంతరం పామూరు పట్టణంలో ప్రధాన వీధుల్లో భారీ సంఖ్య విద్యార్థులతో పోలీస్ అమరవీరుల ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పామూరు సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు , చంద్రశేఖరపురం సబ్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటేశ్వర నాయక్ ,వెలిగండ్ల సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణ పావని ,ఏ ఎస్ ఐ షేక్ జిలాని భాష పోలీస్ సిబ్బంది విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జూనియర్ కళాశాలకు సెలవు

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బుధవారం ఆయా ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను జూనియర్ కళాశాల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని ఆయన ఆదేశించారు.

## పుల్లల చెరువు మండల పాస్టర్ ఫెలోషిప్ మీటింగ్





**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా** :శివాజీ వినుకొండ నియోజకవర్గం ఇన్చార్జి:పుల్లల చెరువు మండల పాస్టర్ ఫెలోషిప్ మీటింగ్ కొమరోలు గ్రామంలో పాస్టర్ కె ఇశ్రాయేలు ఆధ్వర్యంలో కొమరోలు చర్చిలో దేవుని మహిమార్ధమై ఘనంగా జరిగనది కార్యక్రమంలో పాస్టర్లు పెద్దలు విశ్వాసులు పాల్గొని దేవునికి మహిమకరంగా ప్రార్ధనలు జరిపారు

## అమరవీరుల దినోత్సవం శావల్యాపురం



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :**
అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని గ ది. 2004 సంవత్సరంలో మావోయిస్టుల దాడిలో అమరుడైన గంట వారి పాలెం గ్రామం,శావల్యపురం మండలానికి చెందిన కానిస్టేబుల్ 283,యాతరసు వెంకట రవి కుమార్ చిన్నారి, విగ్రహానికి, వారి కుటుంబ సభ్యులతో కలిసి అమరవీరుల వారోత్సవం సందర్భంగా వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య , శావల్యాపురం ఎస్ఐ మరియు పోలీసు సిబ్బంది ఘన నివాళులు అర్పించారు.

## పేద బ్రాహ్మణులకు బియ్యం వితరణ ..




**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** విశ్రాంత ఉపాధ్యాయులు, బ్రాహ్మణ పెద్దలు సి.హెచ్. రఘు మాస్టారు ఆధ్వర్యంలో విద్యానగర్ లోని వారి ఇంటి వద్ద నాలుగు పేద బ్రాహ్మణ కుటుంబములకు బియ్యం వితరణ జరిగినది. ఈ కార్యక్రమం నకు సహాయం అందించిన చింతలచెర్వు రఘు, సిహెచ్. సుబ్బారావు, అచ్యుతన మురళి క్రిష్ణ, ఎస్. మల్లికార్జున శాస్త్రి ల సహాయ సహకారములతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ గతంలో బ్రాహ్మణులు అపరకర్మములు చేసుకొనుటకు ప్రభుత్వచీఫ్ విప్ జీవి ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావు లు అద్దె ప్రాతిపదికన ఎన్ఎస్పి వారి స్థలం ను బ్రాహ్మణ సేవాసమితి కి కేటాయించడం జరిగినది. కనుక ఆ స్థలాన్ని శాశ్వత ప్రాతి పదికన,బ్రాహ్మణులకు కేటాయించినచో నిర్మాణం చేసుకుంటామని కోరారు. ఈ కార్యక్రమంలో గాలి రమణారావు, చింతలపూడి భద్రయ్య, భువనగిరి సుబ్రహ్మణ్యం, గోగులపాటి మాధవరావు, భాగవతుల రవికుమార్, ధూళిపాళ్ళ నాగేశ్వరరావు,రవి కుమార్, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, గోపాలుని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25న ఒంగోలులో భారీ జాబ్ మేళా

**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన ఒంగోలులోని ఏకేవీకే డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పీ రాజాబాబు తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ నుంచి పీజీ వరకు ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ కంపెనీల్లో వెయ్యికిపైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. వేతనాలు రూ.11వేల నుంచి రూ.35వేల వరకు ఉండగా కొన్ని కంపెనీలు ప్రోత్సాహకాలు, ఇతర భత్యాలు కూడా అందిస్తాయని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జే రవితేజ పాల్గొన్నారు

# ఈ దేశంలో పోలీసులు సేవ చిరస్మరణీయం... అరుణ్ కుమార్ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు





**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం నివాళులర్పించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్

ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఈ దేశంలో భారత రాజ్యాంగం అనుసరించి పనిచేస్తున్న అన్ని శాఖల్లో కెల్లా ప్రధానంగా పోలీస్ శాఖ వారి సేవ చరస్మరణీయమని నిజంగా వారు తమ కుటుంబాలను సైతం పక్కనపెట్టి ఈ దేశంలో ప్రతి ప్రజానీకానికి అండగా భద్రతగా రక్షణ కల్పిస్తుంటే ప్రభుత్వాలు పోలీసు వ్యవస్థకు ఇస్తున్న హామీలను నెరవేర్చటంలో వైఫల్యం చెందాయని కనీసం ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా వారంలో ఒకరోజు పోలీసులకు సెలవు ప్రకటించాలని అలాగే నిజాయితీగా పనిచేసే అధికారుల కుటుంబాలకు ఉపయోగపడే ప్రయోజనాన్ని ప్రభుత్వమే చూడాలని దేశ సేవలో భాగంగా అమరులైన పోలీసు సమర వీరులకు మాల మహానాడు జాతీయ రాష్ట్ర కమిటీలు సగర్వంగా నివాళులర్పిస్తూ ఈరోజు రాజ్యాంగం లోని చట్టాలను కాపాడే బాధ్యత పోలీసు వ్యవస్థ తీసుకున్నది కాబట్టే ఇప్పటికే రాజ్యాంగంపై నమ్మకం ప్రజల్లో సన్నగిల్లలేదని అరుణ్ కుమార్ అన్నారు గుంటూరులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన వారిలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్, రాష్ట్ర మహిళా కార్యదర్శి పిల్లి మేరీ, వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, సత్యం, ఆళ్ళ హరి తదితరులు ఉన్నారు


# వైసీపీ నేత భూమనకు పోలీసుల నోటీసులు



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి తిరుపతి ఎస్వీ వర్సిటీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శ్రీ వెంకటేశ్వర గో సంరక్షణశాలలో గోవుల మృతిపై భూమన చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ విషయంలోనే ఈ నెల 23న ఉదయం 11 గంటలకు విచారణ హాజరుకావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. శ్రీ వెంకటేశ్వర గోశాలలోని అధికారుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే పదుల సంఖ్యలో గోవులు అకాల మరణం చెందాయంటూ ఇటీవల భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు చేశారు. వాటికి సరైన సంరక్షణ, వైద్యం అందించడంలో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. అయితే, భూమన చేసిన ఈ ఆరోపణలు రాజకీయంగా సంచలనం సృష్టించాయి. మరోవైపు ఆయన చేసిన ఆరోపణలను పలువురు ఖండించారు. ఈ నేపథ్యంలోనే కొందరు భూమనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని, సాక్ష్యాలు చూపాలంటూ భూమనకు నోటీసులు జారీ చేశారు. మరి పోలీసుల విచారణకు భూమన హాజరవుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.

## నానమ్మ వైద్యానికి సాయం కోరిన యువకుడికి ఊహించని షాక్..

**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :** సైబర్ నేరగాళ్ల మోసానికి ఎంతో మంది తమ సొమ్మును పోగొట్టుకున్న ఘటనలు ఎన్నో చూశాం. వివిధ రకాలుగా వ్యక్తులకు ఫోన్‌లు చేసి వారిని నమ్మబలికి పెద్ద మొత్తంలో దోచేస్తారు కేటుగాళ్లు. సైబర్ నేరగాళ్ల విషయంలో అలర్ట్‌గా ఉండని పక్షంలో సర్వం కోల్పోవడం ఖాయం. సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు అనేక సార్లు చెప్పినప్పటికీ కొందరు మాత్రం వారి మోసపు వలలో చిక్కుతూనే ఉంటారు. తాజాగా జిల్లాకు చెందిన ఓ యువకుడిని బురిడీ కొట్టించారు కేటుగాళ్లు.యూట్యూబర్, ఇన్ఫ్లుయెన్సర్ హర్షసాయి ఫౌండేషన్ పేరుతో ఆర్థిక సాయం అంటూ యువకుడిని మోసం చేశారు. హర్షసాయి ఫౌండేషన్ నుంచి సహాయం ఆశించి మోసపోయానని నల్లచెరువు మండలం గొల్లపల్లికి చెందిన భయ్యప్ప అనే యువకుడు వాపోయాడు. తన నాయనమ్మ అనారోగ్యంతో ఉండడంతో వైద్యం చేయించడానికి హర్షసాయి ఫౌండేషన్‌ను పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో మెసేజ్ చేశాడు యువకుడు. హర్షసాయి ఫౌండేషన్ నుంచి సహాయం పొందాలంటే మొదట కొంత మొత్తం డబ్బులు కట్టాలంటూ భయ్యప్ప నుంచి విడతల వారీగా 1,80,000 రూపాయలు దండుకున్నారు సైబర్ నేరగాళు ..నాయనమ్మ వైద్యం ఖర్చులకు సరిపడా 3,50,000 నగదు ఇస్తామని చెప్పి తన వద్ద డబ్బులు ఫోన్ పే చేయించుకున్నారని యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్థిక సహాయం చేయకపోగా తన దగ్గర తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే



సైబర్ నేరగాళ్లు బెదిరిస్తున్నారని యువకుడు తెలిపాడు. హర్షసాయి ఫౌండేషన్‌కు చెందిన ప్రతినిధులుగా చెప్పుకుంటున్న మధుబాబు, సౌమ్య అనే ఇద్దరు వ్యక్తులు తనతో ఫోన్లో మాట్లాడి బెదిరింపులకు గురి చేస్తున్నారని చెప్పుకొచ్చాడు. హర్షసాయి ఫౌండేషన్ చేతిలో మోసపోయిన తనకు న్యాయం చేయాలంటూ సైబర్ క్రైం పోలీసులకు యువకుడు భయ్యప్ప ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి విషయాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం పోలీసులు మరోసారి హెచ్చరించారు.

## ఆ భూతం లేకపోవడంతో రెట్టింపు ఉత్సహంతో దీపావళి వేడుకలు..



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 21 క్రిష్ణా :**రాష్ట్రాన్ని ఐదేళ్లు పట్టి పీడించిన భూతం లేనందుకు నిన్న రాష్ట్ర ప్రజలు రెట్టింపు ఉత్సాహంతో దీపావళి జరుపుకున్నారని గురజాల ఎమ్మెల్యే, తెలుగుదేశం సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మారీష కుట్రలు ఎన్ని పన్నినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఇక ఆగదనే నమ్మకం నిన్న ప్రజల్లో కనిపించిందన్నారు. తమ పార్టీకి, తమకు ఇక రాజకీయ భవిష్యత్తు లేదనే ఆందోళన వైసీపీ నేతల మాటల్లో కనిపిస్తోందని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు అడ్డంగా నరికారు కాబట్టే 151నుంచి 11కు వచ్చారని గ్రహించాలని హితవుపలికారు. ఇంకా రఫా రపా అంటూ విర్రవీగితే వచ్చేసారి ఆ 11 కూడా మిగలవని హెచ్చరించారు. రాక్షసుల్లా ప్రవర్తించే వైసీపీ... రాజకీయ పార్టీని కాకుండా, ఓ దొంగల ముఠాని నడుపుతోందని విమర్శించారు. జగన్ కుట్రలను, వైసీపీని ప్రజలు 53 గ్రేడ్ సిమెంట్‌తో పాతరేసి మళ్లీ పైకి లేవకుండా చేశారంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ, జగన్ డీఎన్ఏలోనే విధ్వంసం అనే విషం ఉ ందన్నారు. ఏ శాస్త్రవేత్త, వైద్యుడు కూడా మందు కనిపెట్టని ఈ విషం వైద్యానికో, ఆపరేషన్‌లతోనో నయమయ్యేది కాదని.. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రజలే వైద్యులు, శాస్త్రవేత్తలుగా మారి వైసీపీ అనే విషం మళ్లీ రాష్ట్రానికి రాకుండా చూడాలని కోరారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల వైసీపీ నేతల బిడ్డలు కూడా బాగుపడతారని తెలిసి కూడా విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతల మద్యం కుంభకోణం అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే లేని నకిలీ మద్యాన్ని సృష్టించేందుకు కుట్రపన్నారని ఫైర్ అయ్యారు. అధికారం కోసం, ధనదాహం కోసం తల్లి, చెల్లితో పాటు ఎవరి మధ్య అయినా చిచ్చు పెట్టేందుకు జగన్ వెనుకాడరని విమర్శలు గుప్పించారు. ఆంధ్రప్రదేశ్‌పైనా, అమరావతి పైనా విషం చిమ్మటం ఇకనైనా మానుకోకుంటే వైసీపీకి మళ్లీ చావుదెబ్బ తప్పదని యరపతినేని శ్రీనివాస్ వార్నింగ్ ఇచ్చారు.

# సినిమా



## చిరంజీవితో ఉన్న ఈ చంటోడిని గుర్తు పట్టారా?

పై ఫొటోలో మెగాస్టార్ చిరంజీవితో ఉన్న ఈ చంటోడిని గుర్తు పట్టారా? చూస్తుంటే ఇదొక ఫొటో ఫ్రేమ్ లా కనిపిస్తోంది. ప్రస్తుతం తెలుగు సినిమాలు, వెబ్ సిరీస్ లు, సీరియల్స్ , టీవీ షోల్లో నటిస్తోన్న ఓ ప్రముఖ నటుడి సోషల్ మీడియా అకౌంట్ లో ఈ ఫొటో దర్శనమిచ్చింది. మరి ఈ ఫొటోలో చిరంజీవి పక్కన ఉన్నదెవరో కనిపెట్టారా? అతను ఇప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీలో బాగా ఫేమస్. వెండితెరతో పాటు బుల్లితెరను ఏలుస్తున్నాడు. హీరోగా, విలన్ గా, సహాయక నటుడిగా, యాంకర్ గా.. ఇలా మల్టీ ట్యాలెంట్ చూపిస్తున్నాడు. ముఖ్యంగా బుల్లితెరపై ఈ నటుడికి ఓ రేంజ్ లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. చాలా మంది సీరియల్స్ నుంచి సినిమాల్లోకి వెళతారు.. కానీ ఇతను చాలా డిఫరెంట్. చైల్డ్ ఆర్టిస్టుగా చిన్నతనంలోనే సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాడు. నందమూరి బాలకృష్ణ, సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాల్లో బాలనటుడిగా నటించాడు. చిన్నప్పుడే తన నటనతో అందరినీ మెప్పించాడు. తన నటనా ప్రతిభకు ఏకంగా నంది పురస్కారం కూడా అందుకున్నాడు. అది కూడా దివంగత సీఎం వైఎస్సార్ చేతుల మీదుగా.. ఆ తర్వాత హీరోగానూ ఎంట్రీ ఇచ్చాడు. పలు సినిమాల్లో కథానాయకుడిగా నటించాడు. అయితే ఎందుకోగానీ వర్కవుట్ అవ్వలేదు.దీంతో నిరాశపడకుండా బుల్లితెరకు వచ్చేశాడు. అంతే ఒకే ఒక్క సీరియల్ ఈ నటుడి జీవితాన్ని మార్చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇంటిల్లి పాదికి దగ్గర చేసింది. ప్రస్తుతం సీరియల్స్ తో పాటు, టీవీ షోలతో బిజీగా ఉంటోన్న అతను మరెవరో కాదు బ్రహ్మముడి ఫేమ్ మానస్ నాగుల పల్లి.చైల్డ్ ఆర్టిస్టుగా బాలయ్య నరసింహనాయుడు, మహేష్ బాబు అర్జున్, రవితేజ వీడే సినిమాల్లో నటించాడు మానస్. ఏడో తరగతిలోనే ఓ సినిమాకు బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ గా నంది అవార్డు కూడా తీసుకున్నాను. ఇక ఆ తర్వాత హీరోగా పలు సినిమాల్లో నటించాడు. ఝలక్, గ్రీన్ సిగ్నల్, కాయ్ రాజా కాయ్, గోలీ సోడా, ప్రేమికుడు, క్షీరసాగర మథనం సినిమాలతో అలరించాడు. ఆ తర్వాత బిగ్‌బాస్ తెలుగు 5వ సీజన్‌లో పాల్గొని గ్రాండ్ ఫినాలే వరకు చేరుకున్నాడు. ఈ షో నుంచి బయటకు రాగానే కోయిలమ్మ, బ్రహ్మముడి సీరియల్స్ తో బుల్లితెర హీరోగా బోలెడంత మంది అభిమానులను సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు పలు సీరియల్స్ తో పాటు జబర్దస్త్ షోకు యాంకర్ గానూ వ్యవహరిస్తున్నాడు.





## ఈ పండు పోషకాల నిధి.. రాత్రంతా నానబెట్టి తింటే ఆ సమస్యలు రమ్మన్నా రావండోయ్..

అత్తిపండ్లు (అంజీర్)లో అనేకపోషకాలు దాగున్నాయి.. అంజీర్ పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రోటీన్, ఫైబర్, కాల్షియం, పొటాషియం, ఇనుము, రాగి అనేవి అంజీర్‌లో లభించే కొన్ని స్థూల.. సూక్ష్మపోషకాలు. ఇది శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు.

ఉదయం ఖాళీ కడుపుతో రాత్రిపూట నీటిలో నానబెట్టిన అంజీర్ పండ్లను తినడం వల్ల బరువు తగ్గుతారు. అంజీర్ పండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి.. కాబట్టి అవి బరువు తగ్గడానికి సహాయపడతాయి.

ఐరన్ (ఇనుము) లోపంతో బాధపడేవారు అంజీర్ పండ్లను తినాలి.. ఎందుకంటే అవి హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతాయి. అంజీర్ పండ్లను తినడం ద్వారా, మీరు అనేక వ్యాధుల నుండి దూరంగా ఉండవచ్చు.

అంజీర్ పండ్లు తినడం వల్ల మీ ముఖం ప్రకాశవంతంగా మారుతుంది. కాబట్టి మీరు రెగ్యులర్ గా అంజీర్ పండ్లు తినవచ్చు.. తద్వారా చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.

అత్తి పండ్లలోని ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. షుగర్ కూడా కంట్రోల్ ఉంటుంది..

అంజీర్ పండ్లు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.. అధిక ఫైబర్ ఉండటం వల్ల మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.


అంతేకాకుండా శరీర రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. పలు సమస్యలతో పోరాడటంలో సహాయపడుతుంది.

అంజీర్ లోని పోషకాలు గుండె ఆరోగ్యం మెరుగుపడేందుకు సహాయపడతాయి.. ఎముకల ఆరోగ్యం కూడా బలోపేతం అవుతుంది.

ఎలా తీసుకోవాలి..

ప్రతి రోజూ ఉదయాన్నే నానబెట్టిన ఒక అంజీర్ పండు తినడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని డైటిషీయన్లు చెబుతున్నారు.

అంతేకాకుండా.. కావాలంటే.. రాత్రిపూట పాలతో కలిపి తీసుకోవచ్చు.. ఎలా తిన్నా.. డబుల్ ప్రయోజనాలను పొందవచ్చు..



## ఆరోగ్యానికి ఏది మంచిది? ఇలా తెలుసుకోండి!

మాంసాహారం తినడంలో రకరకాల అనుమానాలు. ఒకళ్లు చికెన్ మంచిదంటే.. ఇంకొకళ్లు 'కాదు మటన్ మంచిదం'టారు. చికెన్ బెస్ట్ ప్రొటీన్ ఫుడ్ అని కొందరంటే.. మటన్.. ప్రొటీన్, ఫ్యాట్ బ్యాలెన్స్ ఫుడ్ అని మరికొందరంటారు. అసలు ఈ రెండిటి కంటే చేపలు, రొయ్యలు మేలంటారు ఇంకొందరు. మాంసాహారంపై ఇలా రకరకాల వాదనలు జరుగుతుంటే.. ఇప్పుడు కొత్తగా "మాంసం ఏదైనా.. ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు సైంటిస్టులు. ఏ మాంసమైనా కొలెస్ట్రాల్‌ను పెంచేదే కాబట్టి దానివల్ల గుండె పోటు, గుండె జబ్బులొచ్చే ప్రమాదం ఉందని చెప్తున్నారు.

చికెన్ %జం% రెడ్ మీట్

చికెన్‌లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. మటన్‌లో ప్రొటీన్‌తో పాటు ఫ్యాట్స్ కూడా ఉ ంటాయి. కొవ్వు తినకూడదు, కొలెస్ట్రాల్ పెరుగుతుంది అనుకునే వాళ్లు మటన్‌కి బదులు చికెన్‌ను ఎంచుకుంటారు. అయితే కొలెస్ట్రాల్‌తో సంబంధం లేని వాళ్లు మాత్రం మటన్‌ని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇక ఈ రెండు ఆరోగ్యానికి అంత మంచివికావనుకునే వాళ్లు చేపలు, రొయ్యలు తింటుంటారు. అసలు ఈ మూడిట్లో ఏది మంచిది. ఏది చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది అని తెలుసుకునేందుకు 'అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ సంస్థ' ఓ రీసెర్చ్ చేసింది. ఇప్పటి వరకు కొలెస్ట్రాల్‌ను పెంచే మాంసాహారం రెడ్ మీట్ ఒక్కటే అనుకునే వాళ్లు.. కానీ ఈ రీసెర్చ్ ఆ ఆలోచనని పూర్తిగా మార్చేసింది. రెడ్ మీట్, వైట్ మీట్ రెండూ కార్డియోవ్యాస్కులర్ డిసీజెస్‌కు కారణమవుతాయని తేల్చింది. మాంసం ఏదైనా కొలెస్ట్రాల్ మీద ఒకే రకమైన ప్రభావాన్ని చూపుతుదట.

ఎల్‌డీఎల్‌తో ప్రమాదం

నిత్యం మనం తినే ఆహారాల వల్ల మన శరీరంలో కొవ్వు పేరుకుపోతుందని అందరికీ తెలిసిందే. అందులో చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్), మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) అని రెండు ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ మన శరీరానికి మేలు చేస్తే, చెడు కొలెస్ట్రాల్ మాత్రం మనకు చేటు చేస్తుంది. పలు అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతుంది. ముఖ్యంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోతే గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ. బరువు కూడా పెరుగుతారు. అయితే ఈ రకమైన 'లో శాచ్యురేటెడ్ ఫ్యాట్స్' రెడ్ మీట్, వైట్ మీట్ రెండింటిలో ఉంటుందని సైంటిస్టులు చెప్తున్నారు.

## 20 బంతుల చితక్కొట్టుడు.. 14 సిక్సర్లు, 4 ఫోర్లు బాదిన టీమిండియా ప్లేయర్..

టీ20 క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు సాహిల్ చౌహాన్ అనే ఆటగాడి పేరిట ఉంది. సైప్రస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఎస్టోనియా తరఫున ఆడిన సాహిల్ కేవలం 27 బంతుల్లోనే సెంచరీ చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. అయితే, ఓ టీమిండియా మాజీ ఆటగాడు కేవలం 20 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన సంగతి చాలామంది తెలియదు. ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో జరగలేదు. ఇది ప్రతిష్టాత్మక క్లబ్ మ్యాచ్‌లో జరిగింది. ఇంతటి విస్ఫోటక సెంచరీ సాధించిన బ్యాట్స్‌మెన్ మరెవరో కాదు వృద్ధిమాన్ సాహా. 2018లో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్(%జూాదీ%) నిర్వహించిన %ు%20 టోర్నమెంట్‌లో వృద్ధిమాన్ సాహా కేవలం 20 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్, మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ జట్లు తలబడ్డాయి. మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన వృద్ధిమాన్ సాహా అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచాడు. అంతేకాదు ఒకే ఓవర్‌లో 6 సిక్సర్లు కొట్టి కేవలం 20 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

తొలి బంతి నుంచే అద్భుతమైన బ్యాటింగ్ కనబరిచిన వృద్ధిమాన్ సాహా.. ఈ మ్యాచ్‌లో 14 సిక్సర్లు, 4 ఫోర్లు బాదాడు. దీని ద్వారా అతను 20 బంతుల్లో 102 పరుగులు సాధించాడు. వృద్ధిమాన్ సాహా చేసిన ఈ అద్భుతమైన సెంచరీ సహాయంతో, మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ జట్టు బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్ నిర్దేశించిన 152 పరుగుల లక్ష్యాన్ని కేవలం 7 ఓవర్లలోనే ఛేదించి 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. 7 సంవత్సరాల క్రితం వృద్ధిమాన్ సాహా చేసిన ఈ పేలుడు సెంచరీ దేశీయ గడ్డపై ఇప్పటివరకు సాధించిన వేగవంతమైన సెంచరీగా రికార్డుల్లోకి ఎక్కింది.

సాహా కెరీర్ విషయానికొస్తే.. 2010లో టీమ్ ఇండియా తరఫున అరంగేట్రం చేసిన వృద్ధిమాన్ సాహా 40 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఆడాడు. ఈ సమయంలో అతడు 56 ఇన్నింగ్స్‌లు ఆడి 3 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలతో మొత్తం 1353 పరుగులు సాధించాడు. అదేవిధంగా, భారత్ తరఫున 9 వన్డేలలోనూ వికెట్ కీపర్‌గా ఆడిన సాహా కేవలం 41 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అందువల్ల, 2014 తర్వాత అతనికి భారత వన్డే జట్టులో అవకాశం రాలేదు. ఈ సంవత్సరం ప్రారంభంలో అన్ని రకాల ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు వృద్ధిమాన్ సాహా. ఇప్పుడు బెంగాల్ అండర్-23 జట్టు కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేశాడు.



## గాయంతో టీమిండియాకు దూరం..

దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌కు ముందు రిషబ్ పంత్‌కు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. ఆయన కెప్టెన్‌గా నియమితులవ్వడం గమనార్హం. దక్షిణాఫ్రికాతో జరిగే రెండు మ్యాచ్‌లలో ఇండియా ఏ జట్టుకు నాయకత్వం వహించేందుక సిద్ధమయ్యాడు. భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటన వచ్చే నెలలో ప్రారంభమవుతుంది. ఈ దక్షిణాఫ్రికా పర్యటన టెస్ట్ సిరీస్‌తో ప్రారంభమవుతుంది. ఇందులో మొదటి మ్యాచ్ నవంబర్ 14న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్ట్‌ల సిరీస్ కోల్‌కతాలో జరుగుతుంది.దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ 2 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా పంత్..భారత పర్యటనలో టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు, దక్షిణాఫ్రికా ఇండియా ఏతో రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు కూడా ఆడుతుంది. రిషబ్ పంత్ ఈ రెండు మ్యాచ్‌లలో ఆడటమే కాకుండా జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించనున్నాడు. అయితే, ఇండియా ఏ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య జరిగే రెండు నాలుగు రోజుల మ్యాచ్‌ల షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు.

గాయం తర్వాత రీఎంట్రీకి రెడీ..గాయం కారణంగా రిషబ్ పంత్ ప్రస్తుతం టీం ఇండియాకు దూరంగా ఉన్నాడు. ఇంగ్లాండ్ పర్యటనలో అతని కాలికి గాయం అయింది. ఆ గాయం నుంచి కోలుకున్న పంత్ తిరిగి మైదానంలోకి రావడానికి సిద్ధంగా ఉ న్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌లో పంత్ తిరిగి వస్తాడని భావిస్తున్నారు. అందుకే బీసీసీఐ మ్యాచ్ ప్రాక్టీస్ కోసం అతన్ని ఇండియా ఏ జట్టులో చేర్చడమే కాకుండా, అతనికి ఆదేశాన్ని కూడా ఇచ్చింది.దక్షిణాఫ్రికా భారత పర్యటన షెడ్యూల్..

భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా పూర్తి స్థాయి సిరీస్‌లో తలపడతాయి. అంటే ఇందులో టెస్ట్ సిరీస్ మాత్రమే కాకుండా వన్డే, టీ20ఐ సిరీస్‌లు కూడా ఉంటాయి. పూర్తి షెడ్యూల్ విడుదలైంది. కోల్‌కతాలో నవంబర్ 18న తొలి టెస్ట్ ముగిసిన తర్వాత, రెండవ టెస్ట్ నవంబర్ 22 నుంచి గౌహతిలో జరుగుతుంది. రెండు టెస్ట్‌ల సిరీస్ తర్వాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరుగుతుంది. ఇది నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6 తేదీలలో జరుగుతుంది. మొదటి వన్డే రాంచీలో, రెండవ వన్డే రాయ్‌పూర్‌లో, మూడవ వన్డే విశాఖపట్నంలో జరుగుతుంది.పర్యటన ముగింపులో, దక్షిణాఫ్రికా 5 మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్‌ను ఆడుతుంది. ఇందులో మొదటి మ్యాచ్ డిసెంబర్ 9న కటక్‌లో, డిసెంబర్ 11న చండీగఢ్‌లో, డిసెంబర్ 14న ధర్మశాలలో, డిసెంబర్ 17న లక్నోలో, డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో జరుగుతుంది.



Printed by katikala Vara Prasad. Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .H NO : 21-119, WEST IBRAHIMPATNAM, KRISHNA, ANDHRA PRADESH - 521456.. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.